క్లుప్తంగా

108లో ప్రసవం



నెల్లికుదురు: మండలంలోని పెద్దతండాకు చెందిన నూనావత్ యాకమ్మ పురుటి నొప్పులతో బాధ పడుతుండగా ఆదివారం 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలోనే ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు పైలట్ వెంకన్న తెలిపాడు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నాడు.

కొత్తగూడ: గంగారం మండలంలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన సునారి మౌనిక అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఆదివారం 108వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ అయ్యాయి. వాహన సిబ్బంది చాకచక్యంగా సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డను కొత్తగూడ పీహెచ్‌సీలో చేర్పించారు.

యూరియా పంపిణీకి క్లస్టర్ల ఏర్పాటు

గార్ల: కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా పంపిణీలో రైతుల సౌలభ్యం కోసం మండలంలో నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు ఆదివారం తెలిపారు. గార్ల రైతువేదిక భవనంలో గార్ల, మద్రిగూడెం, రాంపురం, బుద్దారం పంచాయతీల రైతులకు, శేరిపురం రైతువేదిక భవనంలో సీతంపేట, గోపాలపురం, శేరిపురం, పినిరెడ్డిగూడెం, బాలాజీతండా పంచాయతీలకు, పోచారం రైతువేదికలో పోచారం, కోట్యానాయక్‌తండా, పుల్లూరు, చిన్నబంజర, రాజుతండ, బీఆర్‌ఎస్‌తండా పంచాయతీలకు, ముల్కనూరు సొసైటీలో ముల్కనూరు, చిన్నకిష్టాపురం, పెద్దకిష్టాపురం, మద్దివంచ, సత్యనారాయణపురం పంచాయతీల రైతులకు యూరియా అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

అమ్మవారి సన్నిధిలో అపూర్వ సమ్మేళనం



కొత్తగూడ: మండలంలోని గుంజేడు ముసలమ్మ సన్నిధిలో చిన్ననాటి స్నేహితులు కలుసుకున్నారు. ఖానాపూర్ మండలం బుధరావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు గుంజేడు ముసలమ్మ ఆలయ వేదికగా కలిశారు. అమ్మవారికి పూజలు చేసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మున్నూరు కాపు నూతన సంఘం కార్యవర్గాన్ని కుల పెద్ద ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఎల్లంపేట గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా దిండిగాల చిన్న వీరన్న, ఉపాధ్యక్షుడిగా ముచ్చమారి యాకసాయిలు, ప్రధాన కార్యదర్శిగా శేరి వీరబాబు, కోశాధికారిగా మానేపల్లి వెంకన్న ఎన్నికయ్యారు. అనంతరం పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కాగా అధ్యక్షుడిగా పాటి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా ఈర్ల నర్సింహా, కార్యదర్శిగా పాటి కిషన్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పశువులకు టీకాలు

కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు జుజ్జూర్ తండా గ్రామం, నేరడ శివారుతండాల్లో కిసాన్ పరివార్ లిమిటెడ్ అధినేత సునావత్ భూపాల్‌నాయక్ సహకారంతో పశువులకు ఆదివారం టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో గొర్రెలు, మేకలు పీపీఆర్ టీకాలు, ఆవులకు ఎల్‌ఎస్‌డీ టీకాలు వేసినట్లు వైద్యుడు అలీబకాష్ తెలిపారు. కార్యక్రమంలో బానోత్ సాగర్, మహమ్మద్ సుమ, దొంతు సాయికుమార్, మహ్మద్ రహీశ, డీవై.గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో కోతి పద్మ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు ఆదివారం గోపా డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ బాధిత కుటుంబానికి రూ.3వేలు, క్వింటా బియ్యం అందజేశాడు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పెదగాని వెంకటేశ్వర్లు, గంధసిరి వెంకటేశ్వర్లు, కోతి వెంకటరమణ, కూమారస్వామి పాల్గొన్నారు.

అన్నదానం

మహబూబాబాద్ రూరల్: మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా కంకరబోర్డు ముస్లిం మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు సయ్యద్ ఇమామ్, కలీం, అక్రం, జమీర్, యాకుబ్, యూసఫ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

చెట్ల కిందనే భోజనం

- అసంపూర్తిగా డైనింగ్ హాళ్ల నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా సాగని పనులు
- ఐదింటికి పూర్తయింది ఒక్కటే
- కోతులతో విద్యార్థుల ఇక్కట్లు



చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు



మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో మధ్యలోనే నిలిచిపోయిన డైనింగ్ హాల్ నిర్మాణం

పెద్దవంగర: ఆరుబయట భోజనం చేసుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా భోజనశాలల నిర్మాణాలు చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్యానికి పరిశుభ్రతకు సౌకర్యానికి దోహదపడే ఈ భోజనశాలలు పూర్తయితే వారికి చాలా ఉపశమనం కలుగుతుందని తల్లిదండ్రులు భావించారు. అయితే నిధులు కొరత అడ్డుగా మారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా ప్రతిరోజు ఆరుబయటే చెట్ల కిందనే భోజనం చేయాల్సివస్తోంది.

మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టింది. ఒక్కొక్క హాల్ నిర్మాణం కోసం రూ.12.80లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. కాగా అవుతాపురం, పెద్దవంగర, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు డైనింగ్ హాళ్ల పనులు చేపట్టారు. మండలంలోని 18ప్రాథమిక పాఠశాలలు, 05 ప్రాథమికోన్నత, 05ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు కేజీబీవీ, జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలు ఉన్నాయి. ఎంఈఓ పరిధిలో 28 పాఠశాలలు పని చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో 1,376 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ప్రారంభించి బిల్లులు మంజూరు కాక పోవడంతో మధ్యలోనే వదిలేశారు. మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో డైనింగ్ హాల్ నిర్మాణం గోడల వరకు పూర్తి కాగా, వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో డైనింగ్ హాల్‌కు గోడలపై రేకులు అమర్చారు. కొన్ని పనులు మిగిలిపోయాయి, అవుతాపురం పాఠశాల్లో పనులు మెత్తం పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అయినప్పటికీ నిరుపయోగంగా మారింది. అధికారులు పర్యావేక్షణ లేకపోవడంతో మధ్యలో నిలిచి పోయిన డైనింగ్ హాళ్లు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

కోతుల దాడులు..

భోజనశాలలు అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులు ఆరుబయటే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంలో కోతులు బెదిరిస్తూ ప్లేట్లను ఎత్తుకుపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు కాపలా కాస్తూ ఉండాల్సివస్తోంది. విద్యార్థుల భద్రత కోసం, ఇబ్బందులను నివారించడానికి భోజనశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లా..



మండలంలో భోజనశాలల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. బిల్లులు మంజూరు కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– బుదారపు శ్రీనివాస్, ఎంఈఓ

గ్రామస్థాయినుంచి బీజేపీ బలోపేతం కావాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

గూడూరు: ప్రధాని మోదీ పాలన చూపుతూ గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని భూపతిపేటలో ఆదివారం మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన భూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. అభివృద్ధి కేంద్రానిది, ప్రచారం కాంగ్రెస్‌దిగా చెప్పుకుంటున్నారని, కార్యకర్తలు వాస్తవాలను గ్రామాలలో తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెల్పూరు వెంకన్న, మేరెడ్డి సురేందర్, ఇందు భారతి, దేవేందర్, మోతీలాల్, మల్లయ్య, యాకయ్య, రాజు, నాగేశ్వర్‌రావు, శ్రీశైలం పాల్గొన్నారు.

గృహాల మధ్య నిలిచిన మురుగు నీరు



వీరారం ప్రధాన రహదారిలో నిలిచిన మురుగునీరు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం ప్రధాన రహదారిలో నెల రోజులుగా నిలిచిన ఉన్న మురుగు నీరు దుర్వాసన వెదజల్లుతోంది. కూడళ్ల మధ్య కల్వర్టులు నిర్మించకుండా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వర్షం నీళ్లు పోయే దారిలేక గ్రామ పురవీధుల్లో మోకాళ్లలోతున మురుగు నీరు నిలుస్తోంది. రోజుల తరబడి మురుగు నిల్వ కారణంగా దోమలు, విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో పంచాయతీ రాజ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా కల్వర్టులు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వర్షం నీటిని తొలగించడంతోపాటు నీరు నిల్వకుండా గ్రామ కూడళ్ల మధ్య కల్వర్టులు నిర్మించాలని వీరారం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

లంబాడీలపై కుట్రలను తిప్పికొట్టాలి



అభివాదం చేస్తున్న లంబాడీ నాయకులు

నెహ్రూసెంటర్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్రలను తిప్పికొట్టాలని, అందుకోసం పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన సంఘాల నాయకులు రవీందర్‌నాయక్, నెహ్రూనాయక్, రాజ్‌కుమార్, హరినాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, ధరావత్ వెంకన్న మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన వరంగల్ జిల్లాలో జరగనున్న లంబాడీల శాంతిర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే సీఎం రేవంత్ పాలిటిక్స్ డ్రామాను నడిపిస్తున్నారని ఆరోపించారు. బంజారాలు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేలా అగ్రవర్ణ పార్టీలు, నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిచ్చునాయక్, చందులాల్, రాందాస్‌నాయక్, లావుడ్యా రామునాయక్, శంకర్‌నాయక్, రామచందర్‌నాయక్, మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం



మహేష్

తొర్రూరు రూరల్: మతిస్థిమితం లేని, దివ్యాంగ యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని కంఠాయాపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పస్తం మహేష్ (20) అనే యువకుడు మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, చుట్టు పక్కల వెతికిన ఆచూకీ దొరకలేదు. దీంతో తండ్రి పస్తం వెంకన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పాలకుర్తి: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాఘవపురంలో బాలవికస ఆధ్వర్యంలో నీటి శుద్ధీకరణ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడారు. గ్రామస్తులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో గ్రామ అభివృద్ధి కోసం ముందుకు రావాలని పిలుపున్చిరు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో నీటి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను మహిళలతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలమోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ గుండె బాబు, నల్ల నాగిరెడ్డి పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే..



తొర్రూరు: సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్: సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

తొర్రూరు: దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ప్రారంభమవుతుందని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు అన్నారు.ఆదివారం డివిజన్ కేంద్రంలోని నితిన్ ఫౌండేషన్‌లో మండల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జెల్ల లక్ష్మీనారాయణ, పోగు శ్రీను, తుమ్మ వెంకటేశ్వర్లు, మిర్యాల సతీష్‌రెడ్డి, కొరివి సుధాకరాచారి, వెంకటేశ్వర్ ప్రభాకర్, వీరన్న పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సన్మానం

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా మానుకోట శాఖ బ్రహ్మకుమారీస్ ఆశ్రమం నిర్వాహకులు బ్రహ్మకుమారీ రాజయోగిని సుజాత ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆశ్రమంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా నర్సంపేట శాఖ నిర్వాహకులు బ్రహ్మకుమారి శివజ్యోతి, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గొసికంటి నారాయణ, రిటైర్డ్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేందర్, రిటైర్డ్ ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవి వారోత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కిరాణ వర్తక సంఘ భవనంలో జర్నలిస్టులు, ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాలె యోగేశ్వర రావు, క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు నాళ్ల వేణుగోపాల్, సెక్రెటరీ జంగాల విజయ్, ట్రెజరర్ వనమాల సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దవంగర: మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు శేషవల్లి, సదయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సతీష్, దయాకర్, మధుసూదన్ రెడ్డి, రవి, వెంకన్న, ప్రకాష్, సరితలను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం సంకెపల్లి రవీందర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మండల అధ్యక్షుడు మల్లికార్జున చారి, ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పార్సంది రామయ్యను ప్రజాకవి వాగ్గేయకారుడు జయరాజు ఆత్మీయ అభినంద సన్మానోత్సవం ఆదివారం జయరాజు నివాసంలో నిర్వహించారు. రామయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జలగం వీరస్వామి, తోట శ్రీనివాస్, వెంకన్న, బద్రునాయక్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మధు

బయ్యారం: న్యూడెమోక్రసీ శ్రేణులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అవునూరి మధు అన్నారు. మండలంలోని అల్లిగూడెంలో ఆదివారం నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన ఏజెన్సీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో న్యూడెమోక్రసీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా పేద ప్రజల హక్కులకు రక్షణ కల్పించిన వారు అవుతారన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజల్లో వ్యతిరేకతను పెంచుకొని స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల వల్ల ప్రజల హక్కులకు భంగం కలుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, నాయకులు మురళీక్రిష్ణ, యాకన్న, భిక్షం, నాగేశ్వరరావు, హోలీ, రాము, శోభన్, రాంబాబు, లింగన్న పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రవీంద్రగుప్తా, తదితరులు

మహబూబాబాద్ రూరల్: స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను జాతీయ కుటుంబాలుగా గుర్తించి, ఆదుకోవాలని తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం లీగల్ అడ్వైజర్ భువనగిరి రవీంద్రగుప్తా డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్వాతంత్య్ర సమరయోధుల ప్రతినిధి రఘువంశీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆవరణలో గల జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, జాతీయ గీతం ఆలపించి రవీంద్రగుప్తా మాట్లాడారు. కార్యక్రమంలో సింగు రమేష్, వారసులు చిలుకపల్లి ముత్తులింగం, నీలం సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా ఇబ్బందులు



కురవి: గుండ్రాతిమడుగు సొసైటీ వద్ద రైతుల క్యూ



గూడూరు: పొనుగోడు రైతువేదిక వద్ద..

గూడూరు: మండలంలో యూరియా కోసం రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటి వరకు రైతులకు మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఫర్టిలైజర్ షాపుల్లో పంపిణీ చేశారు. దీంతో రోజు వేల సంఖ్యలో రైతులు బస్తాల కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అధికారులు, ఆదివారం నుంచి మండలంలోని 5 క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికల ద్వారా ఆయా గ్రామాల రైతులకే యూరియా పంపిణీ చేపట్టారు. రైతులు క్యూలో బారులు తీరారు. దీంతో పోలీసులకు, ఇతర సిబ్బందికి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంపల్లి, చింతపల్లి, కురవి, గుండ్రాతిమడుగు(విలేజి), నేరడ గ్రామాల్లో యూరియా పంపిణీతో వందలాది మంది రైతులు క్యూలో నిలుచున్నారు. పోలీసుల బందోబస్తు నడుమ రైతులకు యూరియా పంపిణీ చేశారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో రైతులు క్యూలో నిలబడి గంటలకొద్ది పడికాపులు కాశారు. వచ్చిన యూరియాను తహసీల్దారు, సునీల్‌కుమార్, ఏఓ వాహిని, ఎస్సై రాజు పంపిణీ చేశారు.

యూరియా పంపిణీ..

కొత్తగూడ: మండలంలోని అందరు రైతులకు యూరియా సరఫరా చేయాలనే లక్ష్యంతో ఆదివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేసి కొత్తగూడ, బత్తులపల్లి క్లస్టర్ రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఏఓ ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని ఎనిమిది రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతులకు నాలుగుచోట్ల ఆదివారం అధికారులు యూరియా పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగరాజు, ఏఓ రాంజీ, ఎస్సై తిరుపతి దగ్గరుండి పర్యవేక్షించారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు



పశువులకు ఆవాసంగా మారిన బాలికల వసతిగృహం

- పశువులకు నిలయంగా మారిన బీసీ బాలికల వసతిగృహం

గార్ల: గార్లలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 20ఏళ్ల క్రితం రూ.21 లక్షలు వెచ్చించి నూతనంగా బీసీ బాలికల వసతిగృహం భవనం నిర్మించారు. వసతిగృహం ఊరి చివర ఉందని, రాత్రి సమయంలో భయమేస్తుందని నాడు బాలికలు ఈ వసతిగృహంలో ఉండలేమని అధికారులకు మొరపెట్టుకున్నారు. బాలికల సమస్యను దృష్టిలో పెట్టుకొని గార్లలో నైజాం కాలంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ఖాళీగా ఉండటంతో బీసీ బాలికల వసతిగృహాన్ని ఇందులోకి మార్చారు. నాటి నుంచి ఊరి చివర ఉన్న కొత్త వసతిగృహం నిరుపయోగంగా ఉండటంతో, గ్రామస్తులు పశువులు, గేదెలను మేతకు వదులుతున్నారు. వసతిగృహానిక ఆలనపాలన కరువవడంతో కొందరు తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం గార్లలోని నైజాం కాలంలో నిర్మించిన వసతిగృహం భవనం సైతం శిథిలావస్థకు చేరుకుందని, వర్షం వస్తే కురుస్తుందని బాలికలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి శిథిలమైన బీసీ బాలికల వసతిగృహం భవనానికి మరమ్మత్తులు చేపట్టి బీసీ బాలికల వసతిగృహాన్ని కొత్తభవనంలోకి మార్చాలని బాలికల తల్లితండ్రులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



నిరుపయోగంగా ఉన్న బీసీ బాలికల వసతిగృహానికి మరమ్మతులు చేపట్టి బీసీ బాలికల వసతిగృహాన్ని ఇందులోకి మార్చాలి. ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరుకొని వర్షం వస్తే కురుస్తోంది. దీంతో బాలికల ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ భవనం ఉన్నందున జిల్లా అధికారులు స్పందించి వెంటనే భవనానికి మరమ్మతులు చేపట్టాలి. బాలికలకు భవనం అందుబాటులోకి తీసుకురావాలి.

– కందునూరి శ్రీనివాసరావు, గార్ల

రోస్టర్ పాయింట్ విధానాన్ని రద్దు చేయాలి

ఖానాపురం: ఎస్సీ వర్గీకరణలో జీఓ 99 రోస్టర్ పాయింట్ విధానాన్ని రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు గద్దె సంజీవ, ముడుసు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరు జీఓ కారణంగా ఎస్సీ గ్రూపు మూడులోని మాల, అనుబంధ 25 కులాలకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్, జనాభా లెక్కల ప్రకారం శాస్త్రీయ ఆధారాలతో వర్గీకరణ జరగాల్సి ఉందన్నారు. ఇవేమీ లేకుండానే ఏకపక్షంగా వర్గీకరణ చేయడం సరికాదన్నారు. అశాస్త్రీయమైన వర్గీకరణ వల్ల మాల కులస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ జీఓ ద్వారా మాల, అనుబంధ కులాలు ఇప్పటికే తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో రద్దు కోసం నేడు (సోమవారం) తలపెట్టిన నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం బాధ్యులు దావీదు, సాలయ్య, సురేశ్, వెంకటరత్నం పాల్గొన్నారు.